సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
ఆదివారం । 21 । జూలై । 2024



హత్య కేసులో ఐదుగురి అరెస్ట్

అంగర గ్రామంలో నున్న నరేష్ (38) హత్యకు కేసుకు సంబంధించి పోలీసులు శనివారం ఐదుగురిని అరెస్ట్ చేశారు. 8 లో



వేడుకొందుమా వెంకట గిరి వేంకటేశుని..

గోవింద.. హరి గోవిందా.. అంటూ వెంకన్న స్వామిని భక్తజనం కీర్తించింది. అత్యంత భక్తిప్రపత్తులతో కొలిచి తరించింది. 8 లో

లాభాల పూబంతి



పెళ్లిళ్లు.. పూజలు.. వివిధ శుభ కార్యాలు.. ఇలా ఒకటేమిటి ఏ కార్యక్రమమైనా బంతి పూలకు ప్రత్యేక స్థానం ఉంటోంది. ఆకర్షణీయమైన రంగుల్లో లభించే ఈ పూలకు అన్ని కాలాల్లో గిరాకీ ఉంటుంది. సాంకేతిక పద్ధతులు అవలంబిస్తే ఏడాది పొడవునా సాగు చేయొచ్చు. 8 లో

న్యూస్‌రీల్

గొల్లపాలెంలో రోడ్డుపైకి ఆయిల్ వ్యర్థాలు



గొల్లపాలెం రోడ్డుపైకి చేరిన ఆయిల్ వ్యర్థాలతో కూడిన వర్షపునీరు

మలికిపురం: మండలంలోని గొల్లపాలెంలో ఓఎన్జీసీ ఆయిల్ వ్యర్థాలు రోడ్డుపైకి వస్తున్నాయి. ఇక్కడి ఓఎన్జీసీ జీసీఎస్ లోపల పేరుకుపోయిన వ్యర్థాలు వర్షపు నీటితో కలిసి బయటకు వస్తున్నాయి. డ్రైన్లు మూసుకుపోవడంతో వర్షపు నీరు రోడ్డుపైకి చేరుతోంది. దీంతో గ్రామంలోని నివాస ప్రాంతాలను సైతం వర్షం నీటితో పాటు ఆయిల్ వ్యర్థాలతో కూడిన ముంపు నీరు ముంచెత్తుతోంది. ఆ ముంపు నీటిలో నడుస్తున్న ప్రజలకు కాళ్ల బొబ్బలు వస్తున్నాయని గ్రామస్తుడు గంటా రాజారత్నం తెలిపారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం రూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అగ్నివీర్ వాయు పథకంలో భాగమైన ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఉద్యోగాలకు అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి వసంతలక్ష్మి తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తులకు ఈ నెల 28 వరకూ అవకాశం ఉందన్నారు. 21 ఏళ్ల లోపు అవివాహితులైన యువతీ యువకులు అర్హులన్నారు. 2004 జూలై 3 నుంచి 2008 జనవరి 3లోపు జన్మించిన వారై ఉండాలన్నారు. గణితం, ఫిజిక్స్, ఇంగ్లిషు సబ్జెక్టుల్లో 50 శాతం మార్కుల ఉత్తీర్ణతతో ఇంటర్, డిప్లొమా, తత్సమానమైన విద్యార్హత కలిగి ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు రిజిస్ట్రేషన్ ఫీజు కింద రూ.550 చెల్లించాలన్నారు.

23న డయల్ యువర్ డీఎం

అమలాపురం రూరల్: అమలాపురం ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికులకు అందిస్తున్న సేవలపై ఈ నెల 23వ తేదీ మంగళవారం ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకూ డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తామని డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ మూర్తి శనివారం తెలిపారు. ప్రయాణికులు తమ సలహాలు, సూచనలను 99592 25576 ఫోన్ నెంబర్‌కు తెలియజేయవచ్చని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

24న అమలాపురంలో జాబ్ మేళా

అమలాపురం రూరల్: ప్రముఖ ప్రైవేట్ కంపెనీలో పనిచేయడానికి అమలాపురం జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 24న ఉదయం 10.30 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వసంతలక్ష్మి శనివారం తెలిపారు. 10వ తరగతి, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని వివరించారు. మరిన్ని వివరాలకు 81218 38392 ఫోన్ నంబరులో సంప్రదించాలని ఆమె కోరారు.

'విరాజి' చిత్ర బృందం సందడి



పటవల పైడా కళాశాలలో విరాజి చిత్ర బృందం

తాళ్లరేవు: నటులు వరుణ్ సందేశ్, షాలిని హీరో హీరోయిన్లుగా నటించిన విరాజి సినిమా బృందం శనివారం పటవల పైడా ఇంజినీరింగ్ కళాశాలలో సందడి చేసింది. చిత్రం ప్రమోషన్‌లో భాగంగా వారు ఇక్కడకు వచ్చారు. సినిమాను విజయవంతం చేయాలని కోరారు. చిత్రంలోని పలు డైలాగ్‌లను హీరో వరుణ్ సందేశ్ చెప్పి విద్యార్థులను అలరించారు. తొలుత చిత్ర యూనిట్‌కు కళాశాల జాయింట్ సెక్రటరీ నిత్యా శ్రీరామ్, డీన్ ఎం.వీరభద్రరావు, డీడీ కె.రవీంద్రరెడ్డి తదితరులు స్వాగతం పలికారు. చిత్ర దర్శకుడు అద్యన్త హర్ష, ప్రొడ్యూసర్ మహేంద్ర నాథ్ కొండల తదితరులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన అప్పనపల్లి

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాలబాలాజీ స్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. వర్షం కురుస్తున్న లెక్క చేయకుండా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గోవిందా, గోవింద అంటూ కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరుని దర్శించుకుని ఆనంద పరవశులయ్యారు. ఆలయానికి వివిధ సేవల ద్వారా రూ.80,769 ఆదాయం లభించింది. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.60,265 వచ్చింది. నిత్యాన్నదాన ట్రస్టుకు భక్తులు రూ.20,504 విరాళంగా సమర్పించారు. 1,594 మంది రాగా, 1,072 మంది అన్న ప్రసాదం స్వీకరించారని ఆలయ ఈఓ గ్రంధి మాధవి తెలిపారు.



అల్లవరం మండలంలో నిండుకుండలా లోయర్ కౌశిక



పెదపట్నం మధ్య లంక నుంచి పశుగ్రాసం తరలింపు

జలజీవనం

- జిల్లాలో భారీ వర్షాలు.. వరదలు
- పొంగుతున్న డ్రైన్లు
- ఖరీఫ్‌కు ఆదిలోనే హంసపాదు
- 34,580 ఎకరాల్లో వరి చేలు మునక



ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లిలో చేలు నీట మునగడంతో తేలుతున్న వరి నాట్లు



పి.గన్నవరం మండలం బూరుగులంకలో పడవ ఎక్కేందుకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు

సాక్షి, అమలాపురం: వాన దేవుడు ఉగ్రరూపం దాల్చాడు.. ఆకాశం నుంచి ధారలా కుమ్మరిస్తున్నాడు.. 'జల'జీవనాన్ని తెచ్చాడు.. గడిచిన నాలుగు రోజులుగా జిల్లాలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తుండటంతో ప్రధాన మురుగునీటి కాలువలు పొంగి పొర్లుతున్నాయి. ఈ ఏడాది కనీసం తూడు, గుర్రపు డెక్క తొలగించక పోవడంతో ముంపు నీరు దిగువకు కదలడం లేదు. దీనివల్ల జిల్లాలో వందలాది ఎకరాల్లో వరి చేలు నీట మునిగి.. నారు మడులు, నాట్లు నీట నానుతున్నాయి.

జిల్లాలో శనివారం తెల్లవారు జాము నుంచి రాత్రి వరకూ పలు దఫాలు ఒక మోస్తరు వర్షం కురుస్తూనే ఉంది. సాయంత్రం ఐదు గంటల వరకూ జిల్లాలో సగటున 3.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ఆత్రేయపురంలో 16.4 మి.మీటర్లు కురవగా, అత్యల్పంగా మామిడికుదురు 0.2 మి.మీటర్ల వర్షం పడింది. నాలుగు రోజులుగా భారీ వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ముఖ్యంగా గురువారం ఉదయం నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకూ కుంభవృష్టిని తలపించింది. జిల్లా వ్యాప్తంగా సగటున 7.80 సెం.మీటర్ల వర్షం పడిన విషయం తెలిసిందే. వర్షాలకు ఇటు చేలతో పాటు పట్టణాలు, గ్రామాల నుంచి వచ్చిన నీటితో మురుగునీటి కాలువలు పోటెత్తి ప్రవహిస్తున్నాయి. తూర్పు డెల్టాలో ప్రధాన పంట కాలువలైన తుల్యభాగతో పాటు మధ్య డెల్టాలో కూనవరం, ముమ్మిడివరం మండలంలో వృద్ధ గౌతమీ, అయినాపురం, అల్లవరంలోని లోయర్ కౌశిక, పంచనది, దేశకోడు, ఐ.పోలవరం మండలం నార్త్ అడ్డాల్, సౌత్ అడ్డాల్, రాజోలు దీవిలోని శంకరగుప్తం, గొంది, నోవా డ్రైన్లు పొంగి పొర్లుతున్నాయి. వీటితోపాటు పలు మీడియం డ్రైన్లలో సైతం ఇదే పరిస్థితి నెలకొంది.

ఆలస్యం చేసి.. చోద్యం చూసి

ప్రధాన మురుగునీటి కాలువలు తూడు, గుర్రపు డెక్కతో పూడుకుపోయాయి. వీటికి ప్రస్తుత ప్రభుత్వం ఆలస్యంగా నిధులు మంజూరు చేసింది. పైగా అధికారులు అత్యవసర పనులు గుర్తించి పంపగా కొన్నింటికి కోత విధించింది. కేవలం 99 పనులకు మాత్రం రూ.9,14,17,000 కేటాయించడం గమనార్హం. ఈ నిధులతో డ్రైన్లపై పూర్తి స్థాయిలో పూడిక తొలగించలేమని అధికారులు చెబుతున్నారు. ఇదే సమయంలో అనుమతులు ఆలస్యంగా ఇవ్వడంతోపాటు టెండర్లు ఖరారై పనులు మొదలయ్యే సరికి వర్షాలు వచ్చి పడ్డాయి. దీంతో డ్రైన్ల నుంచి నీరు దిగే అవకాశం లేక వరి చేలు నీట నానుతున్నాయి. జిల్లాలో సుమారు 34,580 ఎకరాల్లో వరి చేలు నీట మునిగినట్లు అంచనా. ప్రస్తుతానికి పెద్దగా నష్టం లేకున్నా వర్షాలు కొనసాగితే పంట దెబ్బతింటోందని రైతులు వాపోతున్నారు. కూనవరం, శంకరగుప్తం డ్రైన్లు సముద్రంలో కలిసే చోట ఉన్న మొగలు పూడుకుపోయాయి. అలాగే వాసాలతిప్ప, లోయర్ కౌశిక మేజర్ డ్రైన్లు దిగే రామేశ్వరం మొగ తెరుచుకుని ఉన్నా అనుకున్న స్థాయిలో ముంపునీరు దిగడం లేదు. దీనివల్ల సుమారు 60 వేల ఎకరాలకు సంబంధించిన ముంపు నీరు దిగే అవకాశం లేదు.

కొంచెం కొంచెంగా పెరుగుతూ..

గోదావరికి స్వల్పంగా వరద పెరిగింది. పి.గన్నవరం మండలం జి.పెదపూడిలంక, ఊడిమూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక వాసులు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. ఇక్కడ శుక్రవారం కన్నా శనివారం కొంత వరద ఉధృతి పెరిగిందని స్థానికులు చెబుతున్నారు. అలాగే పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోకి వచ్చే పెదమల్లంక, అనగారిలంక, శిర్రావారిలంకకు కోనసీమ జిల్లా నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. పి.గన్నవరం మండలం యర్రంశెట్టివారిపాలెం నుంచి ఈ గ్రామాలకు తాత్కాలిక రహదారిని ఏర్పాటు చేసుకున్నారు. ఆ రోడ్డు గోదావరి వరదకు కొట్టుకుపోవడంతో ప్రజలు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి దిగువకు 4,09,459 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో వరద పెరుగుతోందని, అయితే లంక గ్రామాల్లోకి వచ్చే అవకాశం లేదని అధికారులు చెప్పారు. లంక గ్రామాల్లో పశుగ్రాసాన్ని రైతులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

జాయింట్ కలెక్టర్‌గా నిషాంతి

సాక్షి, అమలాపురం: జిల్లా కొత్త జాయింట్ కలెక్టర్‌గా టి.నిషాంతి వస్తున్నారు. ఇప్పటి వరకూ జేసీగా పనిచేసిన నుపూర్ అజయ్ బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం శనివారం రాత్రి జీఓ విడుదల చేసింది. జిల్లా ఏర్పడిన తరువాత తొలి జేసీగా ధ్యాన్‌చంద్ బాధ్యతలు నిర్వహించగా, తరువాత నుపూర్ అజయ్ జేసీగా వచ్చారు. జేసీగా ఉన్న ఆమె సీసీఎల్ఏ జాయింట్ సెక్రటరీగా బదిలీపై వెళుతున్నారు. కొత్త జేసీ నిషాంతి ఇప్పటి వరకూ సీసీఎల్ఏ జాయింట్ సెక్రటరీగా పనిచేస్తూ బదిలీపై వస్తున్నారు.

ప్రతి జిల్లాలో కమ్యూనిటీ నిర్వహణ కేంద్రాలు



సదస్సులో మాట్లాడుతున్న సెర్ప్ ప్రాజెక్టు మేనేజర్ సత్యభామ

తాళ్లరేవు: ప్రతి జిల్లాలో కమ్యూనిటీ నిర్వహణ శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ప్రాజెక్టు మేనేజర్ సత్యభామ తెలిపారు. కమ్యూనిటీ నిర్వహణ శిక్షణ కేంద్రాల (సీఎంటీసీ) ఏర్పాటుకు సంబంధించి కోరంగి గోదావరి మహా సమాఖ్య (జీఎంఎస్)లో మూడు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. దీనికి సత్యభామతో పాటు శ్రీకాకుళం ఐబీ కె.మోహన్ హాజరై కమ్యూనిటీ నిర్వహణ శిక్షణ కేంద్రాల ఏర్పాటు, నిర్వహణపై 13 జిల్లాల డీపీఎం, ఐబీ, ఏపీఎంలు, మండల మహిళా సమాఖ్యలు, ఓబీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సత్యభామ మాట్లాడుతూ రాష్ట్రంలో 20 జిల్లాలకు సీఎంటీసీ ప్రభుత్వ భవనాలు సమకూరాయన్నారు. జిల్లాల్లోని మండల, గ్రామ సమాఖ్యల సభ్యులకు వారి శక్తి సామర్థ్యాల పెంపునకు ప్రభుత్వం ఈ శిక్షణ ఇస్తుందన్నారు. జీఎంఎస్ ఇన్‌చార్జి బాబూరావు, తాళ్లరేవు ఏపీఎం రెడ్డి సన్యాసిరావు, జీఎంఎస్ అధ్యక్షురాలు బొమ్మిడి వెంకటలక్ష్మి, కోశాధికారి కొల్లు నాగ సులోచన, సభ్యులు భవానీ, కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వరదలను సమర్థవంతంగా ఎదుర్కొందాం..

అధికారులతో కలెక్టర్ మహేష్ కుమార్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

అమలాపురం రూరల్: గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని గోదావరి వరదలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులకు సూచించారు. శనివారం అమలాపురం కలెక్టరేట్ నుంచి ఆయన మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వరదల నివారణ సన్నద్ధతపై సమీక్షించారు. గోదావరిలో నీరు ఎక్కువగా చేరుతున్న నేపథ్యంలో లంక గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. పి.గన్నవరం మండలం జి.పెదపూడి వద్ద నాలుగు లంక గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయని, జిల్లాలో ఇంకెక్కగా ఇటువంటి సమస్య లేదని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఆయా ప్రాంతాల్లో మర పడవలు, లైఫ్ జాకెట్లు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. మున్సిపాలిటీల్లో వర్షపు నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్లకు సూచించారు. జిల్లాలోని 22 మండలాల్లో 422 ఎకరాల్లో నర్సరీలు, 8,888 ఎకరాల పంట పొలాలు నీట మునిగాయని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. డ్రైన్లలో తూడు, గుర్రపుడెక్కను తొలగించడానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. వరదలు వచ్చినప్పుడు ఏ గ్రామాల్లో ఎంత తాగునీరు అవసరం, లంక గ్రామాలకు ఏ విధంగా తాగునీటిని రవాణా చేయాలనే అంశాలపై చర్చించారు. విద్యుత్ సమస్యలను తెలిపేందుకు టోల్ ఫ్రీ నంబర్ 94906 10101ను అందుబాటులో ఉంచామన్నారు. బలహీన వంతెనలపై భారీ వాహనాలు వెళ్లకుండా గడ్డర్లు ఏర్పాటు చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు పాల్గొన్నారు.

పంట్లు, పడవలకు అనుమతి ఉండాలి

పక్కా అనుమతులతోనే రేవుల వద్ద పంట్లు, పడవలు నడపాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో వివిధ రేవుల నిర్వహణపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. జిల్లాలో అధికారిక, అనధికారికంగా 13 రేవుల వద్ద పంట్లు, పడవలు నడుపుతున్నారని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ రాజ్ చట్టం 1994 ప్రకారం రేవుల నిర్వహణ జాయింట్ కమిటీల ఆధ్వర్యంలో జరగాలని ఆదేశించారు. కె.గంగవరం, రాజోలు, ఐ.పోలవరం, మామిడికుదురు, పి.గన్నవరం, సఖినేటిపల్లి మండలాల్లో పంట్లు, పడవలు నడుపుతున్నట్లు అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వీటికి వారంలో అనుమతులు తీసుకోవాలన్నారు.

రికార్డు స్థాయికి వర్జీనియా పొగాకు ధర


- కిలో గరిష్ఠ ధర రూ.400
- సగటు ధర రూ. 388
- రూ.1,269 కోట్ల పొగాకు విక్రయాలు



దేవరపల్లి: వర్జీనియా పొగాకు ధర రికార్డు స్థాయికి చేరుకుంది. శనివారం మార్కెట్లో కిలో గరిష్ఠ ధర రూ.400, కనిష్ఠ ధర రూ.259, సగటు ధర రూ.388 రైతులకు లభించింది. వారం రోజులుగా మార్కెట్ నిలకడగా కొనసాగింది. కిలో గరిష్ఠ ధర రూ.381 ఉండగా, కనిష్ఠ ధర రూ.225, సగటు ధర రూ.331 ఉంది. శనివారం మార్కెట్లో గరిష్ఠంగా కిలోకు రూ.19 పెరిగి రూ.400కు చేరింది. సగటు ధర రూ.388 పలకడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఈ ఏడాది మార్కెట్ ఏ స్థాయికి పోతుందో అధికారులకు అంతుచిక్కడంలేదు. రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెంలోని 1,2 వేలం కేంద్రాల్లో జరిగిన కొనుగోళ్లు ఈ విధంగా ఉన్నాయి. దేవరపల్లి వేలం కేంద్రంలో 35,354 కిలోలు విక్రయం జరగ్గా కిలో గరిష్ఠ ధర రూ.399, కనిష్ఠ ధర రూ.259, సగటు ధర రూ. 388 పలికింది. జంగారెడ్డిగూడెం–1 వేలం కేంద్రంలో 41,005 కిలోల పొగాకు విక్రయం జరగ్గా కిలో గరిష్ఠ ధర రూ. 399, కనిష్ఠ ధర 235, సగటు ధర రూ. 371.77 లభించింది. జంగారెడ్డిగూడెం–2 వేలం కేంద్రంలో 49,259 కిలోల విక్రయం జరగ్గా, కిలో గరిష్ఠ ధర రూ.399, కనిష్ఠ ధర రూ.235, సగటు ధర రూ.376.07 లభించింది. కొయ్యలగూడెం వేలం కేంద్రంలో 50,495 కిలోలు విక్రయం జరగ్గా, కిలో గరిష్ఠ ధర రూ.399, కనిష్ఠ ధర రూ.235, సగటు ధర రూ.361.12 రైతులకు లభించింది. గోపాలపురం వేలం కేంద్రంలో 63,425 కిలోలు విక్రయం జరగ్గా, కిలో గరిష్ఠ ధర రూ.400, కనిష్ఠ ధర రూ. 235, సగటు ధర రూ. 371.36 లభించినట్లు పొగాకు బోర్డు రీజనల్ మేనేజరు జీఎల్‌కే ప్రసాద్ తెలిపారు. 2300 బేళ్లు అమ్మకానికి రాగా, 1962 బేళ్లు కొనుగోలు చేసినట్లు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు ఐదు వేలం కేంద్రాల్లో 40.31 కిలోల పొగాకు విక్రయాలు జరగ్గా, దీని విలువ రూ.1,269 కోట్లు ఉందని ఆయన చెప్పారు. కిలో గరిష్ఠ ధర రూ.400, కనిష్ఠ ధర రూ.235, సగటు ధర రూ.314.97 లభించినట్లు ఆయన తెలిపారు.

'పంపా'కు పెరుగుతున్న వరద ఉధృతి

- 93 అడుగులకు చేరిన నీటిమట్టం
- వచ్చే వారం ఆయకట్టుకు నీరు విడుదల



వరద నీటితో నిండుకుండలా పంపా రిజర్వాయర్

అన్నవరం: స్థానిక పంపా రిజర్వాయర్‌కు వరద ఉధృతి అంతకంతకు పెరుగుతుండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. శుక్రవారం సాయంత్రం 91.5 అడుగులు ఉన్న నీటిమట్టం శనివారం సాయంత్రానికి అడుగున్నర పెరిగి 93 అడుగులకు చేరుకుంది. ఆదివారం ఉదయానికి మరో అడుగు పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. పంపా క్యాచ్‌మెంట్ ఏరియాలోని రౌతులపూడి ఏజెన్సీలో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కొండవాగులు పొంగడంతో ఆ నీరంతా అన్నవరంలోని పంపా రిజర్వాయర్‌కు చేరుతోంది. ఏలేరు ప్రాజెక్ట్ ఎడమ కాలువ ద్వారా విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు నీరు సరఫరా అవుతున్న విషయం తెలిసిందే. అత్యవసర పరిస్థితిలో ఆ కాలువ నుంచి పంపా రిజర్వాయర్‌కు నీటిని సరఫరా చేసేందుకు గాను రౌతులపూడి మండలం శృంగవరం వద్ద స్లూయిజ్ ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఆ స్లూయిజ్ నుంచి పంపాకు నీరు విడుదల చేయడంతో ఆ నీరు కూడా పంపాకు చేరుతోంది. ఫలితంగా పంపా రిజర్వాయర్ నీటిమట్టం వేగంగా పెరుగుతోంది.

హోరాహోరీగా ఆర్యాపురం బ్యాంక్ ఎన్నికలు


- వర్షంలో సైతం భారీగా తరలివచ్చిన ఓటర్లు
- పూర్తి స్థాయి భద్రత, రక్షణ చర్యలు చేపట్టిన పోలీస్ యంత్రాంగం
- ఓటు హక్కు వినియోగించుకున్న 18,876 మంది



పోలింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్



చైర్మన్ అభ్యర్థి చల్లా శంకరరావు



ఓటేస్తున్న చైర్మన్ అభ్యర్థి నందెపు శ్రీను

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో పేరుపొందిన ది ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ పాలకమండలి ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. శనివారం జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరం శ్రీకందుకూరి వీరేశలింగం విద్యాసంస్థల ఆవరణలో 48 పోలింగ్ కేంద్రాలలో బ్యాంక్ ఎన్నికలు నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. అర్బన్ బ్యాంకు పరిధిలో 16 బ్యాంచ్‌లలో 11 డైరెక్టర్ల పోస్టులకు ఎన్నికలు నిర్వహించారు. ఈ బ్యాంక్‌లో 74,585 మంది ఖాతాదారులు తమ ఓటు హక్కును కలిగి ఉన్నారు. మొత్తం 54 పోలింగ్ కేంద్రాలకు గానూ రాజమహేంద్రవరం పరిధిలోని 8 బ్రాంచీలలో 70,519 మంది ఓటర్లు ఓటు హక్కు కలిగి ఉండగా 48 పోలింగు కేంద్రాలు, 4,066 ఓటర్లు తమ ఓటు హక్కు సద్వినియోగం చేసుకునేందుకు దివాన్ చెరువు, భీమవరం, అమలాపురం, విశాఖపట్నం సీతమ్మధార, గుంటూరు బ్రాంచీలలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 54 కేంద్రాలలో నిర్వహించిన పోలింగ్‌లో 18,876 ఓట్లు పోలయ్యాయని ఎన్నికల అధికారి కృష్ణకాంత్ ప్రకటించారు. 25.31 పోలింగ్ శాతం నమోదైందన్నారు. ప్రధానంగా నందెపు శ్రీనివాస్, చల్లా శంకరరావు చైర్మన్ అభ్యర్థులుగా రెండు ప్యానల్స్ డైరెక్టర్లతో కలసి పోటీ పడ్డారు. ఏ విధమైన అవాంఛనీయ ఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన భద్రత, రక్షణ చర్యలు చేపట్టారు. స్వయంగా ఎస్పీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించారు.

పాల్గొన్న నాయకులు

ఈ ఎన్నికల ప్రక్రియలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, సీజీసీ సభ్యులు శ్రీఘాకోళ్లపు శివరామసుబ్రహ్మణ్యం, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, ఆర్యాపురం బ్యాంక్ మాజీ చైర్ పర్సన్ గిరిజాల రామకృష్ణ తులసి, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం రీజనల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, రాజమహేంద్రవరం పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, గిరజాల బాబు, ఏపీహెచ్‌బీసీ మాజీ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, పోలు విజయలక్ష్మి, సంకిస భవానీ ప్రియ, గూడూరి రాధిక, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య వాగ్వాదం

ఎస్‌కేవీటీ పాఠశాల ఆవరణలో జరిగిన పోలింగ్ ప్రక్రియలో రెండు వర్గాల మధ్య వివాదం చోటు చేసుకుంది. ఓటు వేసేందుకు వెళుతున్న ఓటర్లకు నందెపు శ్రీనివాస్ ప్యానల్‌కు చెందిన ఎన్నికల గుర్తుల స్లిప్‌లను తీసుకుని చల్లా శంకరరావు ప్యానల్‌కు చెందిన స్లిప్‌లు అందిస్తుండటంతో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో ఘటనా స్థలానికి పోలీస్ అధికారులు, ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు చేరుకుని ఇరు వర్గాలకు నచ్చజెప్పడంతో వాగ్వాదం సద్దుమణిగింది.

నేడు ఓట్ల లెక్కింపు కార్యక్రమం

శ్రీ కందుకూరి వీరేశలింగం విద్యాసంస్థల ఆవరణలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు కార్యక్రమం ప్రారంభం అవుతుందని ఎన్నికల అధికారి కృష్ణకాంత్ ప్రకటించారు. దీని కోసం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేశారు.

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్య

రౌతులపూడి: ఓ వివాహిత గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. రౌతులపూడి ఎస్సై వెంకటేశ్వరరావు కథనం ప్రకారం.. రౌతులపూడి మండలం ఎస్.పైడిపాలకు చెందిన వివాహిత గండేపల్లి అనిత (28) ఈ నెల 17న గడ్డి మందు తాగింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. భర్త రాముతో వచ్చిన చిన్న పాటి తగాదా కారణంగా మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

లైంగిక దాడిపై కేసు నమోదు

అయినవిల్లి: ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వి.రాజేష్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..

అయినవిల్లి మండలం తొత్తరమూడి గ్రామానికి చెందిన యువకుడు నెల్లి వెంకటరమణ సిరిపల్లిలోని బంధువుల ఇంటికి గతంలో వచ్చాడు. ఆ సందర్భంలో 15 ఏళ్ల బాలికను విలసలోని ఓ ఇంటికి తీసుకెళ్లి లైంగిక దాడి పాల్పడ్డాడు. అప్పటి నుంచి ఆ బాలికను శారీరకంగా, మానసికంగా చిత్రహింసలకు గురిచేస్తున్నట్లు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. దీనిపై సీఐ డి.ప్రశాంత్‌కుమార్ విచారణ చేస్తున్నట్లు వివరించారు.

గోదావరిలో యువకుడి గల్లంతు


వంశీకృష్ణ (ఫైల్)

కొవ్వూరు: స్థానిక స్నానఘట్టంలో ఓ యువకుడు గల్లంతయ్యాడు. స్థానికుల కథనం ప్రకారం.. నల్లజర్ల మండలం ఆవపాడుకు చెందిన పసుపులేటి వంశీ కృష్ణ (25) శుక్రవారం ఉదయం ఇంటి నుంచి రాజమహేంద్రవరం సినిమాకు వెళుతున్నట్లు చెప్పి మోటార్ సైకిల్‌పై బయలు దేరాడు. అయితే రాత్రయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అంతా గాలించారు. కొవ్వూరు ఎరినమ్మ స్నానఘట్టం వద్ద అతని మోటారు సైకిల్ కనిపించింది. ఆ యువకుడు నదిలోకి దిగడం గుర్తించామని స్థానికులు చెబుతున్నారు. నదిలోకి దిగి ప్రమాదవశాత్తూ గల్లంతయ్యాడా? లేకుంటే ఆత్మహత్య చేసుకున్నాడా అనే కోణంలో స్థానిక పోలీసులు విచారణ చేస్తున్నారు. ఆ యువకుడి ఆచూకీ కోసం బంధువులు, కుటుంబ సభ్యులు నదిలో వెతుకుతున్నారు.

లాభాల పూబంతి

- పూజలు, అలంకరణలో ప్రత్యేక స్థానం
- ఏడాది పొడవునా పూలకు డిమాండ్
- సస్యరక్షణతో అధిక దిగుబడులు

ఆలమూరు: పెళ్లిళ్లు.. పూజలు.. వివిధ శుభ కార్యాలు.. ఇలా ఒకటేమిటి ఏ కార్యక్రమమైనా బంతి పూలకు ప్రత్యేక స్థానం ఉంటోంది. ఆకర్షణీయమైన రంగులు, వివిధ ఆకారాల్లో లభించే ఈ పూలకు అన్ని కాలాల్లో మంచి గిరాకీ ఉంటుంది. ఆధునిక సాంకేతిక పద్ధతులు అవలంబిస్తే ఏడాది పొడవునా బంతి సాగు చేసేందుకు ఆస్కారం ఉంటుందని ఉద్యాన శాఖ వివరిస్తోంది. ఈ సాగులో సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక లాభాలు ఆర్జించవచ్చని కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ సాంకేతిక విభాగం శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా బంతి పూలలో దాదాపు 33 రకాల జాతులు ఉన్నాయి. మన దేశంలో ప్రధానంగా ఐదు రకాల బంతి పూలు మాత్రమే సాగుకు అనుకూలం. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా బంతి పూల సాగు సుమారు రెండు వేల ఎకరాల్లో జరుగుతోంది. ఆలమూరు, ఆత్రేయపురం, కడియం, సీతానగరం, కపిలేశ్వరపురం, రాజమహేంద్రవరం రూరల్‌లోని పలు గ్రామాల్లో బంతి పూల తోటలు ఉన్నాయి. జిల్లాలో సాధారణంగా ఏటా జూలైలో సాగుకు శ్రీకారం చుడతారు. ఈ పంట అందుబాటులోకి వచ్చే వరకూ చెన్నై, బెంగళూరుతో పాటు రాష్ట్రంలోని చిత్తూరు జిల్లా కుప్పం, వెంకటగిరి కోట, పుంగనూరు, చిత్తూరు ప్రాంతాల ఉంచి బంతి పూలను కడియపులంక పూల మార్కెట్ వ్యాపారులు దిగుమతి చేసుకుంటారు.

కాలానుగుణంగా ఎదుగుదల

బంతి మొక్కల్లో కాలానుగుణంగా ఎదుగుదల కనిపిస్తోంది. అన్ని కాలాల్లో బంతి దిగుబడిని ఇస్తుంది. మొక్క ఎదుగుదలను బట్టి సస్యరక్షణ చర్యలు తీసుకుంటే సత్ఫలితాలు సాధించవచ్చు. వర్షాకాలంలో మొక్క త్వరగా పెరిగి పూత దశకు చేరుకుంటుంది. శీతాకాలంలో మొక్క గిడసబారినట్లు కనిపించినా త్వరితగతిన పూతకు వస్తాయి. వేసవిలో మొక్క త్వరగా పెరిగినా దిగుబడిలో నాణ్యత లోపిస్తుంది. బంతి పంట ప్రారంభించిన కాలానికి అనుగుణంగా తెగుళ్ల నివారణకు, మేలైన దిగుబడులు సాధించేందుకు వీలుగా రైతులు ప్రణాళికలు రూపొందించుకోవాలి.


బంతి పూలను సర్దుతున్న యువతులు

సస్యరక్షణ చర్యలు ఇలా..

- బంతి సాగులో ప్రధానంగా నీటి యాజమాన్య పద్ధతులు పాటించి కలుపు మొక్కల బెడద రాకుండా చూసుకోవాలి.
- సాగు ప్రణాళికను బట్టి పంట ఏ రోజు కోత ఉంటుందో గమనించి దానికనుగుణంగా నారు పోయడం చేయాలి.
- బంతి నారు పెరుగుదల 20-25 రోజులు. నాటిన 45-50 రోజులకు మొక్కలు మొదటి పూతకు వస్తాయి. మొదటి పూత నుంచి 30-35 రోజులకు చివరి పూత పూర్తవుతుంది.
- బంతి సాగులో కత్తిరింపులు, సూక్ష్మ పోషకాల వినియోగం, సస్యరక్షణ చర్యలు అధిక దిగుబడులు సాధించడానికి చాలా కీలకమని గుర్తించాలి.

కత్తిరింపుల విధానం

- మొక్కలు సాధారణంగా 20-25 సెం.మీ ఎత్తు పెరిగిన తరువాత తలలు తుంచాలి. దీనివల్ల పక్క కొమ్మలు ఎక్కువగా వస్తాయి. మొదట సంక్రమణ విత్తనం (ఎఫ్, హైబ్రీడ్ సీడ్స్‌కు కత్తిరింపు అవసరం లేదు.
- సాధారణంగా మొక్కలు పెరిగిన తరువాత 25-30 రోజులకు సూక్ష్మ పోషకాలు అవసరం. అప్పుడు ఫార్ములా ఫోర్ మందును 2.5 లీటర్ల నీటిలో కలిపి ప్రతి 10-12 రోజులకొకసారి పిచికారీ చేస్తే ఫలితాలు సాధించవచ్చు.


బడుగువానిలంకలో బంతి పూల తోట

పూల కోత

- బంతి పూలు బాగా విచ్చుకొన్న తర్వాతే కోయాలి. ఈ కోతకు ముందు రోజు తడి ఇచ్చి పూలు కోస్తే ఎక్కువ కాలం నిల్వ ఉంటాయి.
- తోటలో కోసిన పూలను గోనె సంచెలో కాని వెదురుబుట్టలో కాని తడిసిన వస్త్రం వేసి మార్కెట్‌కు తరలించాలి.
- పంట కాలంలో 4-5 సార్లు పూల కోతలు ఉంటాయి. సకాలంలో పూల కోతలు కోస్తే ఎకరాకు ఏడు నుంచి ఎనిమిది టన్నుల దిగుబడి వస్తుంది.
- పూల నాణ్యత పాడవకుండా తొడిమను ఒకటిన్నర అంగుళాల పొడవు ఉండేలా కోయాలి.

తెగుళ్లు.. నివారణ చర్యలు

- పొడి వాతావరణ పరిస్థితుల్లో తామర పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల బంతిపూల మొగ్గలు గోధుమ రంగులోకి మారి ఎండిపోతాయి. దీని నివారణకు ఫ్రిపోనిల్ 1.5 మి.లీ. మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- మొగ్గ తొలిచే పురుగును గమనిస్తే ఫెన్వలరేట్ రెండు మి.లీ మందును లీటరు నీటిలో లేదా కరాటే 2.5 మి.లీ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- వర్షాకాలం ఆరంభంలో నాటిన మొక్కలకు ఆకుమచ్చ తెగులు ఆశించవచ్చు. దీని నివారణకు బెనోమిల్ రెండు గ్రాముల మందు లీటరు నీటిలో లేదా అలియెట్ 0.5 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి చల్లాలి.

ఏడాది పొడవునా..



విదేశీ బంతి పూల రకాలు ఏడాది పొడవునా పండుతాయి. దీనివల్ల ప్రతి ఏటా బంతి పూల సాగు చేపడుతున్నాం. సీజన్లతో నిమిత్తం లేకుండా ఎప్పుడూ డిమాండ్ ఉండడంతో బంతి సాగు ఆశాజనకంగా, లాభదాయకంగా ఉంది. ఇది మంచి లాభాలు తెచ్చిపెడుతోంది.
–సాపిరెడ్డి సత్తిబాబు, ఉద్యాన రైతు, కడియపులంక

సాగు లాభదాయకం



ఉద్యాన శాఖ సలహాలు, సూచనలకు అనుగుణంగా బంతిసాగు చేపడితే రైతులకు లాభదాయకంగా ఉంటుంది. ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలి. అప్పుడే తెగుళ్లు నివారించవచ్చు. దిగుబడులు సాధించవచ్చు.
–జి.కోటేశ్వరరావు, డివిజన్ ఉద్యానశాఖ అధికారి, కొత్తపేట

జేసీబీ, లారీ సీజ్


గోవలంకలో కోరంగి పోలీసులు సీజ్ చేసిన జేసీబీ

తాళ్లరేవు: యానాం–ఆంధ్రా సరిహద్దు ప్రాంతంలో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు సమాచారం అందడంతో కోరంగి పోలీసులు దాడి చేసి జేసీబీ, లారీలను సీజ్ చేశారు. కోరంగి ఎస్ఐ ఎస్.రవికుమార్ తెలిపిన వివరాల మేరకు గోదావరి చెంతన పిల్లంక ఏటిగట్టు వద్ద అధికారులు సీజ్ చేసిన ఇసుకను అక్రమంగా తరలించేందుకు పలువురు ప్రయత్నించారు. ఈ విషయాన్ని స్థానికులు వీఆర్వో సుబ్రహ్మణ్యంకు తెలియజేయడంతో ఆయన కోరంగి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కె.గంగవరం మండలానికి చెందిన కోట వాసుకు చెందిన జేసీబీ, ఇసుక అక్రమ రవాణా కోసం వినియోగించిన లారీలను సీజ్ చేశారు. లారీ డ్రైవర్ కర్రి వెంకట్, జేసీబీ యజమాని కోట వాసులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మండల పరిధిలోని పిల్లంక, గోవలంక ఇసుక ర్యాంపులకు సంబంధించి ఎటువంటి అనుమతులు లేకపోవడంతో ఆయా ప్రాంతాల్లో ఇసుకను అక్రమంగా తరలించేవారిపై కఠిన చర్యలు చేపడుతున్నామన్నారు.

ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ

పి.గన్నవరం: మండలంలోని నాగుల్లంక గ్రామంలో ఓ ఇంట్లో రూ.37,500 నగదు, 21 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు కిలోల వెండి వస్తువులను దొంగిలించారు. దీనిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.శివకృష్ణ తెలిపారు. నాగుల్లంకకు చెందిన గ్రంధి అన్నపూర్ణ పది రోజుల క్రితం ఇంటికి తాళాలు వేసి హైదరాబాద్‌లోని తన అక్క ఇంటికి వెళ్లారు. శుక్రవారం ఉదయం ఆమె ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటాన్ని పని మనిషి గమనించిన అన్నపూర్ణకు సమాచారం అందించారు. శనివారం ఆమె నాగుల్లంకకు వచ్చారు. నగదు, బంగారం, వెండి వస్తువులు చోరీకి గురైనట్టు నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీమ్ సభ్యులు వేలిముద్రలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై శివకృష్ణ తెలిపారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు చేరాలి


అధికారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్

సామర్లకోట: సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు గ్రామ స్థాయిలో చేరే విధంగా జిల్లా స్థాయి అధికారులు కృషి చేయాలని విస్తరణ శిక్షణ కేంద్రం (ఈటీసీ) ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ అన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లోని వివిధ శాఖల అధికారులకు మూడు రోజుల పాటు ఈటీసీలో నిర్వహించిన శిక్షణ శనివారంతో ముగిసింది. వేణుగోపాల్ మాట్లాడుతూ పేదరికం లేని గ్రామాలను తయారు చేయడానికి ప్రణాళికగా సాగాలన్నారు. రెండో బ్యాచ్‌లో మరో అంశంపై శిక్షణ ఇస్తామని చెప్పారు. శిక్షణ పొందిన అధికారులు మండల, గ్రామ స్థాయిలో అధికారులకు శిక్షణ ఇవాల్సి ఉంటుందని చెప్పారు. అనంతరం అధికారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, ఫ్యాకల్టీలు జీఎస్ శ్రీదేవి, పి.శ్రీనివాసరావు, ప్రసాద్, ఆంజేయులు పాల్గొన్నారు.

చీడి పిక్కల పరిశ్రమలో చోరీ

శంఖవరం: కొంతంగి గ్రామ శివారులోని శ్రీసంజన ట్రేడర్స్ చీడి పిక్కల పరిశ్రమలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. పరిశ్రమ యజమాని కుక్కా వెంకట కృష్ణంరాజు ఫిర్యాదు మేరకు అన్నవరం ఎస్సై ఐ.కిశోర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. చోరీ జరిగిన తీరు, పరిశ్రమలో నిల్వ ఉంచిన సరకు తదితర అంశాలు అడిగి తెలుసుకున్నారు. సుమారు రూ.3 లక్షల నష్టం ఉంటుందని అంచనా వేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హత్య కేసులో ఐదుగురి అరెస్ట్


అంగర పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీధర్

కపిలేశ్వరపురం: అంగర గ్రామంలో నున్న నరేష్ (38) హత్యకు కేసుకు సంబంధించి పోలీసులు శనివారం ఐదుగురిని అరెస్ట్ చేశారు. ఈ మేరకు అంగర పోలీస్ స్టేషన్‌లో మండపేట రూరల్ సీఐ శ్రీధర్, ఎస్సై అందె పరదేశి వివరాలు వెల్లడించారు. నిందితులు, అంగర గ్రామానికి చెందిన గుత్తుల పోతురాజు, పడమర ఖండ్రికకు చెందిన నెల్లి శ్రీను, కోనాల రాంబాబు, మాతా శ్రీను, దాయం రాంబాబులను కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్టు తెలిపారు. మృతుడు నరేష్‌కు వివాహమైనా మానసిక స్థితి సరిగా లేకపోవడంతో భార్య కుసుమ ప్రసన్న వాడపాలెంలోని తన తల్లి ఇంట్లో ఉంటోంది. అంగర ఎస్టీఆర్ కాలనీలోని తన నివాసంలో నరేష్ ఒక్కడూ ఉంటున్నాడు. ఈ నెల 15న తన ఇంటి సమీపంలోని నిందితుడు పోతురాజు తండ్రితో నరేష్ గొడవపడ్డాడు. తరచూ ఇలా చేస్తుండటంతో పోతురాజు నరేష్‌ను ఎలాగైనా చంపాలన్న ఉద్దేశంతో తన స్నేహితులైన పైనలుగురు నిందితులతో పథకం పన్నాడు. 15న రాత్రి సమయంలో సెంట్రింగ్ కర్రలు, రాడ్‌లతో కొట్టి చంపారు. 16న ఉదయం కుటుంబ సభ్యులు నరేష్ మృతదేహానికి దహన సంస్కారాలు నిర్వహించారు. 18న మృతుడి మావయ్య బండారు వెంకటేశ్వరరావు ఫిర్యాదుపై హత్య కేసును పోలీసులు నమోదు చేశారు. ఈ మేరకు ఐదుగురు నిందితులను హత్యానేరం కింద అరెస్ట్ చేశారు. సమచారం వెల్లడించకుండా దహన సంస్కారాలు చేసిన బంధువులపై కూడా కేసు నమోదు చేసినట్టు సీఐ శ్రీధర్, ఎస్సై పరదేశి తెలిపారు.

పంట కాలువలో కళాశాల బస్సు బోల్తా

క్షేమంగా బయటపడిన విద్యార్థులు


సరిపల్లి వద్ద పంట కాలువలో బోల్తా పడిన బస్సు

ఉప్పలగుప్తం: అల్లవరం మండలం ఓడలరేవు బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల బస్సులో విద్యార్థులను ఎక్కించుకుని శనివారం సాయంత్రం తిరిగి వెళుతుంది. ఈ నేపథ్యంలో స్టీరింగ్ రాడ్ విరిగిపోవడంతో సరిపల్లి గ్రామం వచ్చేసరికి బస్సు ప్రమాదానికి గురైంది. బస్సు పంట కాలువలో పడిపోయింది. ఆ సమయంలో అందులో ఆరుగురు విద్యార్థులు ఉండగా, స్థానికులు బస్సు అద్దాలు పగలగొట్టి వారిని క్షేమంగా బయటకు తీశారు. స్వల్ప గాయాలతో విద్యార్థులు బయట పడ్డారు. విద్యార్థుల నుంచి రవాణా నిమిత్తం రూ.వేలకు వేలు వసూలు చేస్తున్న విద్యాసంస్థల బస్సులను రవాణా శాఖ అధికారులు చెక్ చేయాలని, ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పాలమూరి మోహన్‌బాబు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావులు డిమాండ్ చేశారు.

వేడుకొందుమా వెంకటగిరి వేంకటేశుని..

- భక్తులతో అలరారిన వాడపల్లి
- రూ 23.92 లక్షల ఆదాయం


ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వర స్వామి


తిరుపతిలో శృంగారవల్లభ స్వామి

ఆత్రేయపురం: గోవింద.. హరి గోవిందా.. అంటూ వెంకన్న స్వామిని భక్తజనం కీర్తించింది. అత్యంత భక్తిప్రపత్తులతో కొలిచి తరించింది.. కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయం శనివారం గోవింద నామస్మరణతో మార్మోగింది. ఉదయం స్వామివారిని వివిధ రకాల పండ్లు, పుష్పాలతో అర్చకులు అలంకరించారు. తొలుత భక్తులు గౌతమీ గోదావరిలో స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చారు. ఆలయ ఆవరణలో వేంచేసి ఉన్న వేంకటేశ్వరస్వామి క్షేత్ర పాలకుడు శ్రీఅన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఏడు వారాల నోము ఆచరిస్తున్న భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ఈ ఏర్పాట్లను డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది పర్యవేక్షించారు. స్వామివారికి ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, వివిధ సేవలు, లడ్డూ ప్రసాదం విక్రయాలు, ఆన్‌లైన్ సేవల ద్వారా సుమారు రూ.23,92,462 ఆదాయం సమకూరింది. ఉదయం 10 గంటల నుంచే ఆలయం వద్ద ఏర్పాటైన అన్న సమారాధనలో వేలాది భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించారు. ఆలయం వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు పర్యవేక్షించారు.

కిక్కిరిసిన శృంగార వల్లభుని ఆలయం

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభుని ఆలయానికి శనివారం భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. స్వామి వారికి ప్రీతికరమైన రోజు కావడంతో అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ సేవల టిక్కెట్లు, అన్నదానం, కేశఖండన ద్వారా రూ.1,49,296 ఆదాయం సమకూరినట్లు ఈఓ శ్రీనివాస్ తెలిపారు. సుమారు 12 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకోగా, భక్తులకు ప్రసాద వితరణ చేశారు.


వాడపల్లిలో భక్తుల కోలాహలం


స్వామివారి దర్శనం కోసం క్యూలో భక్తులు